క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఏర్పాటు

కూకట్‌పల్లి: చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం, కూకట్‌పల్లి శాఖ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సన్నిధి శ్రీహరి, కార్యదర్శిగా సన్నిధి వెంకటరమణ, కోశాధికారిగా శేషం శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడిగా చూర్ణం శ్రీనివాస్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా తిరునగరి జయసూరి, ఉపాధ్యక్షులుగా తిరుక్కోవళ్లూరి మురళీధర్, సరిత, సలహాదారులు టి నరేందర్, విద్యాసాగర్, కందనూరి భిక్షపతి, తిరునగరి నర్సింగ్‌రావు, తిరునగరి శ్రీనివాసులు, ప్రజా కార్యదర్శిగా అమ్మంగి శ్రీకాంత్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా తిరువాన్కూర్ రాజేష్, తిరునగరి లలిత, సంప్రదాయక కార్యదర్శి పాలమాకుల రమేష్, ఆడిటర్ శేషం పురుషోత్తం, యువజన కార్యదర్శి తిరుక్కోవళ్లూరి రాహుల్ తేజ, అలగిరి విజయశంకర్‌లను ఎన్నుకున్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక



రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన యువకులు

బాలానగర్: కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బాలానగర్ డివిజన్ ఇంద్రనగర్‌కు చెందిన యువకులు పెద్ద సంఖ్యలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు మధు గౌడ్ ఆధ్వర్యంలో శనివారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఫతేనగర్ డివిజన్ అధ్యక్షుడు రాజు, కూకట్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు ఎం. రమేష్, సీనియర్ నాయకులు తిరుపతయ్య యాదవ్, ముత్యాలు ముదిరాజ్, వెంకటేష్‌గౌడ్, పగిడి రాము, మధు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఆర్‌కే సొసైటీలో కార్పొరేటర్ సబిహా బేగం రూ.25 లక్షలతో చేపట్టనున్న కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తు, ప్రహరీ, అదే విధంగా రూ.20 లక్షలతో చేపట్టనున్న ఫ్రెండ్స్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే కృష్ణారావు సహాయ సహకారాలతో రూ. 45 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు లింగాల ఐలయ్య, షేక్ సుభాన్, చాంద్‌పాషా, జ్ఞానేశ్వర్, షబ్బీర్, తాజుద్దీన్, అబ్దుల్ రజాక్, షఫీ ఉద్దీన్, సలీం, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం



ఆల్విన్‌కాలనీ: షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగిన సంఘటన కూకట్‌పల్లి వివేకానందనగర్‌లో శనివారం చోటు చేసుకుంది. వివేకానందనగర్ కాలనీలోని చక్రధర్ నివాసంలో విద్యుత్ హైఓల్టేజీ కారణంగా అగ్నిప్రమాదం చోటు చేసుకోవడంతో గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. ఇంట్లో ఎక్స్‌టెన్షన్ బోర్డు వద్ద, వైఫై రూటర్ వద్ద పేలుడు కారణంగా మంటలు వ్యాపించినట్లు బాధితులు తెలిపారు.





సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

బాలానగర్: కూకట్‌పల్లి నియోజవకర్గంలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను తన హయాంలో పరిష్కరించానని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం ఆయన స్థానిక కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్‌తో కలిసి ఫతేనగర్ డివిజన్‌లో 11వ రోజు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా డివిజన్ ప్రజలు ఎమ్మెల్యేకు పూలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా గెలిచిన తొమ్మిదేళ్లలో ఇంటింటికి మంచినీరు, రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేశానన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు పరిష్కరించని ఎన్నో సమస్యలను మంత్రి కేటీఆర్ సహకారంతో పరిష్కరించామని, ట్రాఫిక్ సమస్య నియంత్రణకు బాలానగర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జిని నిర్మించామన్నారు. పాదయాత్ర చేస్తుంటే కాలనీల్లో చిన్న చిన్న సమస్యలు, పెన్షన్ల వంటి సమస్యలను తనకు తెలియజేస్తున్నారే తప్ప అభివృద్ధి విషయంలో ప్రజలు నీరాజనం పలుకుతున్నారన్నారు.



ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు పూలతో స్వాగతం పలుకుతున్న మహిళలు



వర్షాన్ని సైతం లెక్క చేయకుండా...

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

భాగ్యనగర్‌కాలనీ: అన్ని రంగాల్లో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. శనివారం ఆయన హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్ఎంటీ శాతవాహననగర్, వర్టెక్స్ లేక్ వ్యూ కాలనీల్లో రూ.55 లక్షలతో చేపట్టిన సీసీ, బీటీ రోడ్ల నిర్మాణం, హెచ్ఎంటీ కాలనీలో రూ.1.80 లక్షలతో చేపట్టిన స్మశాన వాటికను శనివారం కార్పొరేటర్లు నార్నే శ్రీనివాసరావు, దొడ్ల వెంకటేష్ గౌడ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో, మంత్రి కేటీఆర్ సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోఅభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. హైదర్‌నగర్ డివిజన్‌లో అభివృద్ధికి బాటలు వేస్తూ స్మశాన వాటికను ప్రారంభించటం జరిగిందన్నారు. ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని, స్మశాన వాటిల్లో సకల సదుపాయాలు కల్పించి మహా ప్రస్థానం తరహాలో తీర్చిదిద్దుతామన్నారు. ఈ స్మశాన వాటికలో అంత్యక్రియలకు ఫ్లాట్ ఫారం, అడ్మినిస్ట్రేషన్ భవనం, అంతర్గత రోడ్లు, టాయిలెట్లు, వాటర్ ఫౌంటైన్, స్నానాల గదులు, మనిషి జీవితచక్రానికి సంబంధించిన చిత్రాలను చూపించే విధంగా ప్రహరీని నిర్మించటం జరిగిందన్నారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు, ఏరియా కమిటీ మెంబర్లు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కాలనీవాసులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తదితరులు

పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి



సాయినగర్ వెస్ట్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని సాయినగర్‌వెస్ట్‌లో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. శనివారం ఆయన కాలనీలో పర్యటించి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాయినగర్ వెస్ట్ కాలనీలో ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. పెండింగ్‌లో ఉన్న రోడ్డు నెంబర్9,10లో డ్రైనేజీ నిర్మాణం పూర్తి చేసి, సీసీ రోడ్డు చేపట్టాలని, పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. అదే విధంగా రోడ్డు నెంబర్ 6,8,11లలో డ్రైనేజీ లైన్ పనులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని కూడా త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షుడు రాజేష్ చంద్ర, శివరాజ్‌గౌడ్, ప్రభాకర్, శ్రీధర్, వాసుదేవరావు, పోశెట్టి గౌడ్, ఉమేష్, సంతోష్, బిరాదర్, నవీన్, ధీరజ్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

కుత్బుల్లాపూర్: ప్రజా సంక్షేమమే పరమావధిగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. జీడిమెట్ల డివిజన్ పరిధి గోదావరి హోమ్స్‌లో నిర్మిస్తున్న కల్యాణ మండప భవనాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తన వంతు విరాళాన్ని అందజేసిన హన్మంతరెడ్డి ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో గోదావరి హోమ్స్ సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తి మృతి

జీడిమెట్ల: ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్న ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పవన్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా, రామచంద్రాపురానికి చెందిన సతీష్‌కుమార్ వర్మ(35) సూరారం కృషి కాలనీలో ఉంటూ చింతల్‌లోని ఓ రేషన్ షాపులో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం అతను బైక్‌పై చింతల్ నుంచి సూరారం వెళ్తున్నాడు. కుత్బుల్లాపూర్ సిగ్నల్ వద్దకు రాగానే ఎదురుగా స్కూటీపై షాపూర్‌నుంచి బాలానగర్ వైపు వస్తున్న ముగ్గురు వ్యక్తులు సతీష్ బైక్‌ను ఢీ కొట్టారు. ఈ ఘటనలో సతీష్ తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సతీష్ సోదరుడు వెంకట నర్సింహరాజు ఫిర్యాదు మేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించండి



రామయ్యనగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

కూకట్‌పల్లి: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కూకట్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం ఆయన కూకట్‌పల్లి డివిజన్‌లోని రామయ్యనగర్‌లో పలు విభాగాల అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు సీసీ రోడ్డు నిర్మాణం జరగలేదని, వీధి దీపాలు వెలగటం లేదని, పారిశుద్ధ్య సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆయన సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అధికారులు, డివిజన్ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, చందు, రామచంద్రరావు, ఆంజనేయులు, ప్రభాకరరావు, భాస్కర్‌రావు, హనుమంత్‌రావు, నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు

మోతీనగర్: బీఆర్ఎస్ పార్టీలో ఉద్యమకారులు, కార్యకర్తలకు, నాయకులకు ఎప్పుడు గుర్తింపు ఉంటుందని అందుకు నిదర్శనంగా తనను రాష్ట్ర కోఆపరేటివ్ కన్స్యూమర్ ఫెడరేషన్ చైర్మన్‌గా నియమించారని గట్టు తిమ్మప్ప అన్నారు. శనివారం ఆయనను మూసాపేట డివిజన్ అవంతి నగర్ ఈస్ట్ కాలనీ సంక్షేమ సంక్షేమ సంఘం ప్రతినిధులు హకా భవన్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అవంతినగర్ ఈస్ట్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు లయన్ అన్నెం కోటి రెడ్డి, చైర్మన్ బి. ఫణికుమార్‌లు పూలమాలతో తిమ్మప్పను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి టి. దేవేందర్‌రావు, కోశాధికారి బిక్షపతి ముదిరాజ్, సభ్యులు రంగారెడ్డి, కేపీఎల్ నాయుడు, భీం లింగప్ప తదితరులు పాల్గొన్నారు.



గట్టు తిమ్మప్పను సన్మానిస్తున్న అన్నె కోటిరెడ్డి, ఫణికుమార్ తదితరులు

గెలుపే ధ్యేయంగా పని చేయాలి

మూసాపేట: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు కార్యకర్తలు, నాయకులు సమష్టిగా కృషి చేయాలని కర్ణాటక ఎమ్మెల్యే, మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రిజ్వాన్ అర్షద్, పార్టీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మల్లు రవి అన్నారు. మూసాపేట డివిజన్, రాయల్ ఫంక్షన్ హాల్‌లో శనివారం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రిజ్వాన్ అర్షద్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటం తథ్యం అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో వచ్చి తొమ్మిదేళ్లయినా ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో అన్ని హామీలను నెరవేరుస్తామన్నారు. స్థానిక నేతలు ప్రజల్లోకి వెళ్లి కాంగ్రెస్ హామీలను ప్రజలకు వివరించాలన్నారు. కలిసికట్టుగా కూకట్‌పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సత్యం శ్రీరంగం, సత్యం శ్రీరంగం, యాదగిరి, నాగిరెడ్డి, గోపిశెట్టి రాఘవేందర్, తూము వేణు, మోయిజ్, లక్ష్మీ, పుష్పారెడ్డి, డివిజన్ కమిటి అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు రిజ్వాన్ అర్షద్, మల్లు రవి తదితరులు

కల్వరి టెంపుల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, ఎస్ఐ శ్రీనివాస్

కూకట్‌పల్లి: 'సామాన్యులకు ప్రేమతో వైద్యం' నినాదంతో డాక్టర్ పి.సతీష్ కుమార్ కల్వరి టెంపుల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ 7వ ఫేజ్‌లో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, కేపీహెచ్‌బీ ఎస్ఐ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్వరి టెంపుల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో పేదలకు మెరుగైన వైద్యం అందించడం అభినందనీయమన్నారు. పేదలకు ఉచితంగా క్యాంప్ ద్వారా వైద్య పరీక్షలు చేస్తూ ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నందుకు నిర్వాహకులను అభినందించారు. హాస్పిటల్ ఎండీ డాక్టర్ పి. రాజేష్ మాట్లాడుతూ అతి తక్కువ ధరకే అత్యాధునికమైన పరికరాలతో ప్రముఖ వైద్యులచే మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఆర్ఓ జయరాం, రాజు శ్రీధర్, రాజశేఖర్, డాక్టర్ విజయ, డాక్టర్ చంద్రిక, ప్రతాప్, అంజిబాబు, వెంకటరమణ, హరిబాబు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి వ్యాయామం అవసరం

అమీర్‌పేట: ఒత్తిడి లేని జీవన శైలిని కొనసాగించాలంటే రోజు వ్యాయామంతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలని వైద్య నిపుణులు డా.సర్దార్ అన్నారు. ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పిస్తూ శనివారం ఆస్టర్ ప్రైమ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.అమీర్‌పేటలోని ఆసుపత్రి నుంచి ప్రారంభమైన ర్యాలీ హుస్సేన్ సాగర్,ట్యాంక్ బండ్ మీదుగా సాగింది, ఈ సందర్భంగా సర్దార్ మాట్లాడుతూ.. తీసుకునే ఆహారపు అలవాట్లలో వస్తున్న మార్పుల కారణంగా అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. దీనిపై ఇంకా నిర్లక్ష్యం వహించరాదని, ప్రతి రోజు వ్యాయామం, నడక తప్పనిసరిగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్.కె.సన్నీసింగ్, పి.జాన్, శివన్‌కుట్టి పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

దుండిగల్: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ పద్ధతిని పునరుద్ధరించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మేడ్చల్ జిల్లాలో ఉపాధ్యాయుల సంఘాల పోరాట కమిటీ(యూపీఎస్‌సీ) ఆధ్వర్యంలో గండిమైసమ్మలోని దుండిగల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్‌యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయసింహారెడ్డి మాట్లాడుతూ దీర్ఘకాలంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, పీఆర్‌సీ కమిటీ వేసి జులై నుంచి నూతన విధానం వర్తించేలా ఐఆర్ ప్రకటించాలన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, పెండింగ్ బిల్లులను 2004కు ముందే నియామక ప్రక్రియ పూర్తయిన ఉపాధ్యాయులకు ఓపీఎస్ అమలు చేయాలని కోరారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్, జిల్లా అధ్యక్షుడు బ్రహ్మ చారి, మల్కాజిగిరి అధ్యక్షుడు శ్రీనివాస్, యుఎస్‌పీసీ నాయకులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలి



నిజాంపేట్: కార్పొరేట్ ఆస్పత్రులు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని నిజాంపేట్ కార్పొరేటర్ ఎల్లంబాయి జ్యోతి అన్నారు. శనివారం మాదాపూర్‌లోని చెందిన బెస్ట్ విజన్ ఐ హాస్పిటల్ సౌజన్యంతో భండారి లేఅవుట్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భండారి లేఅవుట్ కమిటీ హాల్‌లో సీనియర్ సిటిజన్లకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ జ్యోతి మాట్లాడుతూ కళ్లు ఎంతో ముఖ్యమని, వాటిని ఆరోగ్యంగా ఉంచుకోవాలన్నారు. సంక్షేమ సంఘం అధ్యక్షుడు నర్సింహారెడ్డి మాట్లాడుతూ కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని, ఆదివారం శ్రీరాముని కుంట పార్కులో టూత్ డెంటల్ ఆస్పత్రి సౌజన్యంతో దంత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం సభ్యులు కాంతారావు, నారాయణరావు, వెంకటనర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే రూ. 1000 జరిమానా



సనత్‌నగర్: రోడ్లపై చెత్త వేసే వారిని గుర్తించి వెయ్యి రూపాయల జరిమానా విధిస్తామని బేగంపేట సర్కిల్ డీఈ శ్రీనివాస్ తెలిపారు. ఆటోలు, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి శనివారం ఆయన బేగంపేట బ్రాహ్మణవాడీలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రధానంగా బ్రాహ్మణవాడీ లేన్‌నెంబర్–4లో రహదారిపై పెద్ద ఎత్తున చెత్తను వేస్తున్నారన్నారు. చెత్తను సేకరించే ఆటో ఇంటింటికీ వస్తుందని, ప్రతి ఒక్కరూ చెత్తను ఆటోలోనే వేయాలన్నారు. రోడ్లపై చెత్త వేయరాదంటూ అవగాహన కల్పించారు.

ప్రభుత్వ విద్యను పరిరక్షించుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఏఐఎస్ఎఫ్ ఉద్యమ స్ఫూర్తితో ప్రభుత్వ విద్యను పరిరక్షించుకోవాలని ఓయూ విశ్రాంత జాయింట్ రిజిస్ట్రార్, ఏఐఎస్ఎఫ్ మాజీ నేత ఉప్పరి ఎల్లేష్ అన్నారు. శనివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట జరిగిన ఏఐఎస్ఎఫ్ 88వ ఆవిర్భావ దినోత్సవానికి ఆయన హాజరై జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్య ద్వారానే పేద కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని ప్రభుత్వ నిర్వహణలోనే పేద, మధ్య తరగతి వర్గాలకు ఉచిత విద్య లభిస్తుందని పేర్కొన్నారు. ఓయూలో అన్ని కోర్సులకు భారీగా పెంచిన ఫీజులను తగ్గించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో విద్యకు అధిక శాతం నిధులు కేటాయించాలన్నారు. నెల్లిసత్య, బాలరాజు, సాయి భగత్, సలీం, అమర్‌నాథ్, ప్రసాద్, భవాని, శ్రీవాణి, రాధిక, రాధాకృష్ణ, సాయి పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థి, యువత, నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ కొలపురి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జేఏసీ ప్రతినిధుల బృందం శనివారం పర్యటించింది. ఈ సందర్భంగా తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జేఏసీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... విద్యార్థి సమస్యలు, యువత అభివృద్ధి అంశాలపై సమగ్రంగా విద్యార్థి సంఘాలతో మాట్లాడామన్నారు. విద్యార్థి, యువత, నిరుద్యోగుల సమస్యల కోసం నిరంతరం పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఓబీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, హెచ్‌సీయూ నాయకుడు వై.శివకుమార్‌ముదిరాజ్ మాట్లాడుతూ... రాష్ట్రంలోని అన్ని యూనివర్శిటీలలోని సమస్యల పరిష్కారం కావాలంటే ప్రతి రాజకీయ పార్టీ మేనిఫెస్టోలో విద్యార్థి, నిరుద్యోగ యువత సమస్యలపై స్పష్టమైన వైఖరిని చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు వలిగొండ నర్సింహా మాట్లాడుతూ... రాష్ట్రంలోని నిరుద్యోగ, విద్యార్థి, యువత అభివృద్ధి లక్ష్యంగా పెట్టుకొని రాష్ట్ర వ్యాప్తం పర్యటన చేపట్టినట్లు పేర్కొన్నారు. తెలంగాణ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోడ వంశీనాయక్, హెచ్‌సీయూ బీఎస్ఎఫ్ నాయకులు, రీసర్చ్ స్కాలర్స్ పరశురామ్, రమేష్, ఏబీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రావణ్, బొమ్మెన అనిల్‌కుమార్, అరుణ్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలందరికీ డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలి



ధర్నాలో పాల్గొన్న డాక్టర్ కొరదాల నరేష్ తదితరులు

కూకట్‌పల్లి: పేదలందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ కొరదాల నరేష్ అన్నారు. శనివారం ఇందిరాపార్క్ వద్ద ఏర్పాటు చేసిన ధర్నా కార్యక్రమానికి నరేష్ ఆధ్వర్యంలో బీజేపీ కార్యకర్తలు, నాయకులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేష్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం డబల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో పేదలను మోసం చేసిందన్నారు. శేరిలింగంపల్లిలో వేలాది మంది డబల్ బెడ్‌రూమ్ ఇళ్లకు దరఖాస్తు చేసుకోగా, 10 ఇళ్లు కూడా ఇవ్వలేదన్నారు. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ఆధ్వర్యంలో పేదల గుడిసెలను తొలగించి ధనవంతులకు ఆ భూములను అమ్ముతున్నారన్నారు. స్వంత జాగా ఉంటే రూ.మూడు లక్షలు ఇస్తామని ఇల్లు కట్టుకోమని అంటున్నారని రూ.3 లక్షలకు కనీసం బేస్‌మెంట్ కూడా రాదన్నారు. ఇప్పటికైనా పేదలందరికీ డబల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మొవ్వ సత్యనారాయణ, సురభి రవీందర్ రావు, జానకి రామరాజు, నరేందర్‌రెడ్డి, దుర్గాప్రసాద్, హరికృష్ణ, భూపాల్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.